స్తంభాలకున్న కేబుళ్ల తొలగింపు



మణికొండ: విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను అధికారులు తొలగిస్తున్నారు. ఆదివారం రాత్రి రామంతాపూర్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో పలువురు మృతి చెందటంతో విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అధికంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించే పనులను చేపట్టారు. మున్సిపాలిటీల వ్యాప్తంగా అధికంగా విద్యుత్ ప్రమాదాలకు కేంద్రంగా ఉన్న వాటిని తొలగిస్తున్నామని ఇబ్రహీంబాగ్ డీఈ రమేష్‌చంద్ర తెలిపారు.

వర్షంనీరు నిలిచి ఇబ్బందులు



హసన్‌నగర్‌లో వర్షం నీటిని తొలగిస్తున్న సిబ్బంది

శాస్త్రిపురం: రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలనీలు, బస్తీలు జలమయంగా మారాయి. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని కాలనీలు బస్తీలలో వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మట్టి రోడ్లు పూర్తిగా చిత్తడిగా మారడంతో అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. చెత్త తరలించేందుకు వర్షం అడ్డంకిగా మారడంతో రోడ్లపై భారీగా పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది, హైడ్రా సిబ్బంది పలు బస్తీలలో పర్యటించి వర్షంనీటి తొలగించే పనులు చేపట్టారు.

ప్రమాదాల నివారణకు వినతి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుకు రెండు వైపులా సర్వీసు రోడ్డు వద్దనున్న బండరాళ్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్. మల్లేష్ కోరారు. హెచ్‌ఎండీఏ, నార్సింగి మున్సిపల్ అధికారులకు ఆయన ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి అప్పా చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా బండరాళ్లు ప్రమాదంగా ఉన్నాయన్నారు. ఇటీవల ఎవరూ లేని సమయంలో రోడ్డుపై రాళ్లు పడటంతో ప్రమాదం తప్పిందన్నారు. వినతి ఇచ్చిన వారిలో శంకరయ్య, బాబురావు, శ్రీకాంత్, ప్రకాశ్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్: పట్టణంలోని చిన్నగొల్లపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ కౌన్సిలర్ చెన్నం అశోక్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, టై, ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

గోల్కొండ: రాష్ట్రంలో విద్యుత్ శాఖలో పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని విద్యుదాఘాతంతో వరుసగా పలువురు వ్యక్తులు మృతి చెందుతున్న ఘటనలు జరుగుతుండడం దీనికి నిదర్శనం అని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దేవర వంశీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ స్తంభాలు, తీగల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్న విషయాన్ని ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయన్నారు. ప్రధాన రహదారులపైనే ఈ పరిస్థితి ఉంటే ఇక బస్తీలు, కాలనీలలో ఏ విధంగా ఉంటుందో అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు గానీ ఈ ఘటనలపై స్పందించకపోవడం విచారకరమన్నారు.

కేబుళ్లు కట్!

• విద్యుత్ స్తంభాలకున్న ప్రైవేట్ తీగల తొలగింపు • రాజేంద్రనగర్‌లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో మంగళవారం ఉదయం నుంచి కేబుల్, ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలకు ఉన్న ఈ వైర్లను విద్యుత్ శాఖ సిబ్బంది పూర్తిగా తొలగిస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు అక్రమంగా కేబుల్ వైర్లను ఏర్పాటు చేయడంతో ప్రభుత్వం ఈ కఠిన చర్యలను ప్రారంభించింది. కేబుల్ వైర్ల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో విద్యుత్ శాఖ అధికారులు సమావేశం నిర్వహించి అక్రమంగా ఏర్పాటు చేసిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, బస్తీలు, కాలనీలు, గల్లీల్లోని విద్యుత్ స్తంభాలకు ఇబ్బడి ముబ్బడిగా ఉన్న కేబుళ్లను తొలగించారు.

నిలిచిపోయిన సేవలు...

నియోజకవర్గ పరిధిలో 90 శాతం మేర ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. కేబుల్ వైర్లతో ఉన్న సేవలన్నీ నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. సాధారణ ప్రజలతో పాటు వ్యాపార కేంద్రాల్లో సైతం ఇంటర్నెట్ లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా కేబుళ్లను తొలగించడం ఏంటని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబుల్ వైర్ల తొలగింపు విషయం తెలియని పలువురు ఆయా కస్టమర్ కేర్‌లకు ఫోన్ చేస్తూ ఫిర్యాదు చేశారు.

మూగబోయిన ఫోన్లు..

ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో నియోజకవర్గ పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు కస్టమర్ కేర్‌లను సంప్రదించారు. కస్టమర్ కేర్‌లతో పాటు స్థానికంగా ఉన్న లోకల్ సర్వీసు ప్రొవైడర్ల ఫోన్‌లకు ఫిర్యాదులు చేశారు. ఒక్కసారిగా ఈ ఫిర్యాదులు పెరిగిపోవడంతో మధ్యాహ్నానికే ఈ ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. కస్టమర్ కేర్ సెంటర్లు సైతం పని చేయలేదు. వివిధ సోషల్ మాధ్యమాల్లో వైర్ల తొలగింపు విషయాన్ని ప్రజలు తెలుసుకున్నారు.



విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగిస్తున్న సిబ్బంది

పోలీసుల సహకారంతో..

విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుళ్ల తొలగింపు నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు పోలీసు సహాయాన్ని కోరారు. ఉదయం పోలీసుల సహాయంతో సిబ్బంది కేబుళ్ల తొలగింపును చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ఆపరేటర్లు అడ్డగించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నివారించారు. అనుమతులు లేని వాటినే తొలగిస్తున్నారని.. అనుమతులు ఉంటే చూపించాలంటూ స్థానిక ఆపరేటర్లను పోలీసులు కోరారు. అనుమతులు లేకపోవడంతో ఆపరేటర్లు సైతం వెనుతిరగడం కనిపించింది.

చివరి సీటు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తాం



విద్యార్థినికి ధ్రువపత్రాని అందిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయంలో కోర్సుల్లో చివరి సీటు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సీట్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగవని రిజిస్ట్రార్ విద్యాసాగర్ అన్నారు.మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025–2026 అగ్రికల్చర్,వెటర్నరీ,ఉద్యాన యూజీ కోర్సుల మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది.221 ర్యాంక్ సాధించిన పిడిశెట్టి వర్షితకు రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ కళాశాలలో సీటు రావడంతో పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం వీసీ శరత్‌చంద్రతో కలిసి రిజిస్ట్రార్ ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ కోర్సుల్లో ఎంత కష్టపడి చదవితే అంత ఫలితం ఉంటుందన్నారు. కోర్సుల్లో చేరే సమయంలో జాగ్రత్తలు పాటించాలని గుర్తింపు ఉండే కళాశాలలో మాత్రమే చేరాలని తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మాత్రమే ఐసీఏఆర్ గుర్తింపు ఉందన్నారు. ఈ నెల 23 వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మణికొండ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటప్ప అన్నారు. మంగళవారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడచినా ఇప్పటి వరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించటంలో జాప్యం చేస్తోందన్నారు. ఎన్నికల హామీలను విస్మరిస్తోందని ప్రతి జిల్లాకు డీఈఓ, రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేసి వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలకు 5571 హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రజని, కృష్ణయ్య, విజయ్, స్వాతి, సత్యం, కిషన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు



సమావేశానికి హాజరైన నిర్వాహకులు

అత్తాపూర్: నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వహకులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. గణపతి మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని విద్యుత్ సరఫరాలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాల వద్ద పొగాకు ఉత్పత్తులు, మద్యపానం లాంటివి తీసుకోకూడదని డీజేలు, లౌడ్ స్పీకర్లు పెట్టి స్థానికులను ఇబ్బంది పెట్టకూడదని పూజ సమయంలో మాత్రమే మైక్ సిస్టం ఉపయోగించుకోవాలన్నారు.

మండపాల నిర్వాహకులతో సమావేశం

రాజేంద్రనగర్: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రోరెడ్డి, ఎస్సైలు కిశోర్, సుమన్ తెలిపారు. మంగళవారం వారు మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీధర్, బాల్‌రెడ్డి, మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు సురేశ్ గౌడ్, ప్రేమ్‌సాగర్, నాయకులు మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్, బాబురావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాయలంలో ఎక్కడ కూడా ర్యాగింగ్ అనే మాట వినబడరాదని జూనియర్ విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలని రాజేంద్రనగర్ ఎస్సైలు కిషోర్, రాజకుమార్, భానుప్రకాశ్ పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి ర్యాగింగ్ పాల్పడితే తీసుకునే చర్యల గురించి వివరించారు. విద్యార్థులందరూ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. గత వారం రోజులు నిర్వహించిన పోస్టర్ మెకింగ్, స్లోగన్స్ రైటింగ్,ఎస్సె రైటింగ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.అనంతరం ర్యాగింగ్ దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజావసరాలపై ప్రత్యేక దృష్టి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజావసరాలను ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మిగూడ, హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని మల్లన్న దేవాలయాల పరిసర ప్రాంతాల్లో నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు, నూతన సీసీ రోడ్డు కోసం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలని సూచించారు. త్వరితగతిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు పనులకు అంచనాలు వేసి త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, వినయ్, నాయకులు జనార్దన్, మారయ్య, సాయిరెడ్డి, పద్మానాభం, రాఘునాథ్, మన్మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సురేష్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మిగూడలో పర్యటిస్తున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

'బీఆర్ఎస్' ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు

చందానగర్ : ఈ నెల 24వ తేదిన నిర్వహించనున్న శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వివేకానందనగర్ కార్పొరేటర్ రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావులు పిలుపునిచ్చారు. మంగళవారం మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని అతిథి హోటల్‌లో నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్యనాకుల ఆత్మీయ కలయికను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలో నిఖార్సయిన ఉద్యమకారులు ఉన్నారన్నారు.కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అటు బీఆర్ఎస్ ఇటు కాంగ్రెస్ అంటూ నాటకాలాడుతున్నారన్నారు. త్వరలోనే కొంత మందిపై అనర్హత వేటు పడుతుందని, అందులో భాగంగానే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉపఎన్నిక జరగనుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పురుషోత్తం యాదవ్, మారబోయిన రవి యాదవ్, వాలా హరీష్‌రావు, సతీష్ రావు, మల్లారెడ్డి, రవీందర్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, బీఎస్ఎన్ కిరణ్, దారుగుపల్లి నరేష్, బాబుమియా, జంగయ్య యాదవ్, భద్రయ్య, అంజమ్మ, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ 1104 రాజేంద్రనగర్ సర్కిల్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. రాయల్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంఘం మూడవ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా జీవీ బాబురావు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా బాసును ఎన్నుకున్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం



ఉమ్రా యాత్రికులకు స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

శంషాబాద్: ఉమ్రా యాత్రను పూర్తి చేసుకున్న యాత్రికులు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 60 మంది ప్రయాణికులు 20 రోజుల కిందట ఉమ్రా యాత్రకు వెళ్లి దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారు. మంగళవారం వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విమానాశ్రయానికి వచ్చి పూలమాలలు వేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఆల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్‌అలీ ఆధ్వర్యంలో యాత్ర కొనసాగింది.

'నిథమ్' లైబ్రేరియన్ యాదగిరికి పీహెచ్‌డీ



రాయదుర్గం: గచ్చిబౌలిలోని 'నిథమ్'లో లైబ్రేరియన్ డాక్టర్ నీరుడి యాదగిరికి పీహెచ్‌డీ ప్రదానం చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్, వీసీ కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నారు. డా.యాదగిరి ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రరి అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నుంచి 'యూజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ లైబ్రరీస్ ఇన్ తెలంగాణ స్టేట్: ఏ స్టడీ' అనే అంశంపై డీఈఎస్ఐడీఓసీ డైరెక్టర్ డాక్టర్ కె నాగేశ్వరరావు పర్యవేక్షణలో పూర్తి చేశారు. డాక్టర్‌యాదగిరిని నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్,ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

24న కార్వాన్‌లో భజన పోటీలు

గోల్కొండ: భజన భారతి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న భజన పోటీలు నిర్వహిస్తున్నామని తెలంగాణ భజన భారతి కార్యదర్శి జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. 24న ఉదయం 10 గంటల నుంచి గుడిమల్కాపూర్‌లోని అన్నపూర్ణ ఆలయంలో ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. పురుషులు, స్త్రీలు, బాలురు, బాలికల విభాగాలలో ఈ పోటీలు ఉంటాయన్నారు. ప్రతి బృందంలో గరిష్టంగా ఆరుగురు సభ్యులు ఉండవచ్చునని, జట్టుకు 10 నిమిషాల సమయం కేటాయించబడుతుందన్నారు. నాలుగు విభాగాల్లో మొదటి రెండు స్థానాల్లో గెలిచిన జట్లు ఫైనల్స్‌కు చేరుతాయని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94939 67399, 94404 99231లలో సంప్రదించవచ్చు.

నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



పత్తికుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: వినాయక నిమజ్జనోత్సవానికి తరలి వచ్చే భక్తులకు ఎక్కడ అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పత్తికుంటను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి పత్తికుంట చెరువుకు వినాయక నిమజ్జనోత్సవాలకు భారీ సంఖ్యలో విగ్రహాలను తరలిస్తుంటారన్నారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని వీధిదీపాలు, పరిశుభ్రత, మంచినీరు, వాహనాల పార్కింగ్, రహదారికి మరమ్మతు, చెరువు శుభ్రత పనులను చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఈఈ నరేందర్ గౌడ్, పోలీసు విభాగం నుంచి ఏసీపీ శ్రీనివాస్, బాలాజీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, శానిటేషన్, జలమండలి అధికారులు ఉన్నారు.

బురద.. ఎన్నాళ్లీ బాధ?



తరచూ కురుస్తున్న వర్షాలతో మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో రోడ్లన్నీ చిత్తడిగా రాకపోకలు సాగించే క్రమంలో జారి కిందపడిపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. జూన్ 15న సీసీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–బండ్లగూడ

పేదల బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం

గోల్కొండ: పేదల కోసం వారి ఇంటి సమీపంలోనే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని పీస్ ఫోర్స్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకిలో సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ..నిరుపేదలు ఎక్కువగా నివసించే బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య విషయాలు కూడా సేకరిస్తామన్నారు. అసరమైతే వారికి ప్రభుత్వ ఆసుపత్రులకు పంపి చికిత్స అందించేందుకు కృషి చేస్తామన్నారు. పీస్ ఫోర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా వచ్చే నెల నుంచి నెలకు రెండుసార్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఫహాద్, మహబూబ్ తదితరులున్నారు.

వాణిజ్య శాస్త్ర తెలుగు పదకోశం తయారీ 2.0 ప్రారంభం

చార్మినార్: జాతీయ విద్యా విధానంలో భాగంగా వివిధ విభాగాల్లో అన్ని భారతీయ భాషలల్లో పారిభాషిక పదకోశాల తయారీకి కేంద్ర ప్రభుత్వం ఒక విధానాన్ని చేపట్టిందని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ తెలిపారు. ఇందులో భాగంగా వాణిజ్య శాస్త్ర పదకోశం (ఇంగ్లిష-హిందీ-తెలుగు) తయారీ 2.0 కార్యశాల తమ కాలేజీలో ప్రారంభమైందన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యశాలను ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మంగళవారం ప్రారంభించారు. ఐదు రోజులు జరిగే ఈ కార్యశాలలో వాణిజ్య శాస్త్ర, తెలుగు భాషా నిపుణులు గత ఏప్రిల్‌లో అనువాదం చేసిన పారిభాషిక పదాలను పునఃపరిశీలన చేయడంతో పాటు కొత్త పదాలను కొన్నింటినీ పదకోశానికి అందిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యశాల ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించబడుతుందని కార్యశాల కన్వీనర్ డా.కె. మల్లికార్జున రావు తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్

చార్మినార్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ మంగళవారం నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించి పనులు వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. చార్మినార్ జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్ల వారీగా సంబంధిత డిప్యూటీ కమిషనర్లతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో ఇప్పటికే రివ్యూ నిర్వహిస్తున్నానన్నారు. బహదూర్‌పురా నియోజకవర్గంలో కూడా అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయించడానికి కృషి చేస్తానన్నారు.